



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM



# ఇవాళ నుంచే రంజాన్ ఉపవాస దీక్షలు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది ముస్లీంలకు అత్యంత పవిత్రమైన మాసం ఇది. మక్కాలో చంద్రుని దర్శనం ఆధారంగా రంజాన్ మాసం భారత్‌లో ఎప్పుడూ ప్రారంభమవుతుందనేది నిర్ణయిస్తారు ముస్లీ మత పెద్దలు. నెలవంక ఆకారంలో ఉండే చంద్రుడు ఈసారి సౌదీ అరేబియాలో మార్చి 10వ తేదీన ఆదివారం సాయంత్రం దర్శనం ఇచ్చింది. కాబట్టి మార్చి 11వ తేదీ సోమవారం నుంచి అక్కడ చంద్రుడు దర్శనం ఇవ్వడం జరుగుతుంది. అయితే భారతదేశం, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాల్లో మరుసటిరోజున చంద్రుడు దర్శనమిస్తాడు. అందుకే సౌదీ తర్వాతి రోజు నుంచి మన దేశంలో ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. అంటే ఈ ఏడాది మన దేశంలో ఇవాళ(మార్చి 12వ తేదీ (మంగళవారం)) నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమై ఏప్రిల్ 9 వరకు జరగనున్నాయి.

# లోకసభ ఎన్నికలకు మల్లికార్జున్ ఖర్గే దూరం..!



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కర్ణాటకలోని గుల్బార్గా ఎంపీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేస్తారని, కాంగ్రెస్ జాబితాలో కూడా పేరు చేర్చినట్లు తెలిసింది. కానీ ఖర్గే తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమణిని గుల్బార్గా నుంచి బరిలో దించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మల్లికార్జున్ ఖర్గే గుల్బార్గా నుంచి రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఖర్గే కొనసాగుతున్నారు. ఆయన రాజ్యసభ పదవీ కాలం మరో నాలుగేండ్లు ఉంది. ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కర్ణాటక కేబినెట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన కూడా గుల్బార్గా నుంచి పోటీ చేసే అవకాశం లేదని సమాచారం. దీంతో అల్లుడిని బరిలోకి దించాలని ఖర్గే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తన ఒక నియోజకవర్గానికి పరిమితం కాకూడదని, దేశమంతటా తన సేవలు అవసరం ఉన్నాయని ఖర్గే తన అనుచరులతో చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఎంపీ ఎలక్షన్స్‌కు దూరంగా ఉంటున్నట్టు సమాచారం.



## ఆధార్ అప్డేట్ గడువు పొడగింపు

ఆధార్ కార్డ్ హోల్డర్లకు UIDAI శుభవార్త చెప్పింది. ఆధార్ అప్‌డేట్ గడువును ప్రకటించింది. ఆధార్ కార్డ్ హోల్డర్లు జూన్ 14, 2024 వరకు ఎలాంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా మార్పులు చేసుకోవచ్చని తెలిపింది. ఈ సేవలు myAadhaar పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ప్రజలందరూ తమ ఆధార్ కార్డులలో ఏవైనా మార్పులు ఉంటే ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అభ్యర్థించారు.

## UPI సౌండ్ బాక్సుల బిజినెస్‌లోకి జియో



ప్రముఖ టెలికాం సంస్థ జియో డిజిటల్ పేమెంట్స్ రంగంలో ఎంట్రీకి సిద్ధమైంది. దీంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కు గట్టి ఎదురుదెబ్బ తగలనుంది. ఇండియాలో 20 లక్షల మంది వ్యాపారులు UPI సౌండ్ బాక్సులు వినియోగిస్తుండగా అందులో 85% పేటీఎం కంపెనీవే ఉన్నాయి. ఈక్రమంలో Paytm స్థానంలో జియో సౌండ్ బాక్సులను రిప్లేస్ చేసేలా ప్రణాళికలు చేస్తోంది. అలాగే పేటీఎం, భారత్ పే, ఫోన్ పే కంటే తక్కువ నెలవారి రెంటుకు అందించే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.



## ఇక ఏడాదిలో 2 సార్లు ఐపీఎల్.!

ఫ్యాన్స్‌కి డబుల్ కిక్ ఇచ్చేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో రెండు సార్లు ఐపీఎల్ నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ద్వైపాక్షిక సిరీస్‌లను తగ్గించి, ఒకే ఏడాదిలో తక్కువ మ్యాచ్‌లతో రెండు సార్లు ఐపీఎల్ నిర్వహించవచ్చని రవి శాస్త్రి అభిప్రాయపడ్డాడు. అయితే ఈ దిశగా బీసీసీఐ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.




## ఎస్‌బీఐకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడికి అదనపు సమయం ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. బ్యాంకు తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, నేడు (మంగళవారం) సాయంత్రంలోగా కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ)కి వివరాలు వెల్లడించాల్సిందేనని ఆదేశించింది. బ్యాంకు అందించిన వివరాలను ఈ నెల 15న సాయంత్రం 5 గంటలలోగా తమ అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతపరచాలని సూచించింది.




## అక్కడ గోబీ మంచూరియా, కాటన్ మిఠాయిలపై నిషేధం

ఆరోగ్య సమస్యల దృష్ట్యా కాటన్ క్యాండీలు, గోబీ మంచూరియన్లలో ఫుడ్ కలరింగ్ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపుతూ కర్ణాటక కీలక నిర్ణయం తీసుకుంది. పీచు, గోబీ మంచూరియన్‌లో ఫుడ్ కలరింగ్ ఏజెంట్ రోడమైన్-బిని నిషేధిస్తున్నట్లు కర్ణాటక ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు ప్రకటించారు. రోడమైన్-బి ఫుడ్ కలరింగ్ ఏజెంట్‌ను ఎవరైనా వాడితే ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

# ఇందిరమ్మ ఇళ్లు గైడ్‌లైన్స్ ఇవే..

తెలంగాణ సర్కార్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు ఉత్తర్వులు జారీ చేశారు. మహిళల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని ప్రభుత్వం మార్గదర్శకాల్లో ప్రకటించింది. జిల్లా ఇన్ ఛార్జి మంత్రిని సంప్రదించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. కాగా... ఆర్థిక సహాయం పంపిణీకి గ్రామ, మండల స్థాయిలో అధికారులను ఎంపిక చేసి లబ్ధిదారులను ఎంపిక చేసిన అనంతరం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలల్లో జరిగే గ్రామ, వార్డు సభల్లో ప్రకటిస్తామని పేర్కొంది. కాంగ్రెస్ ఆరు హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పన 4 లక్షల 50 వేల ఇళ్లను సొంత భూమి ఉన్న వారికి 100 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు సర్కార్ తెలిపింది. అంతేకాకుండా.. ప్రభుత్వ పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అయితే.. ఈ పథకాన్ని సోమవారం బూర్గంపాడులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రారంభించి పలువురు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.




### గైడ్‌లైన్స్ ఇవే..


- BPL కుటుంబాలకు చెందినవారై ఉండాలి.
- రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుని ఎంపిక చేస్తారు.
- లబ్ధిదారునికి సొంత ఖాళీ స్థలం ఉండాలి.
- లేదంటే ప్రభుత్వం స్థలం ఇచ్చి ఉండాల్సింది.
- గుడిసె అయినా, గడ్డితో వేసిన పైకప్పు అయినా, మట్టి గోడలతో నిర్మించిన తాత్కాలిక ఇల్లు అయినా కూడా పథకానికి అర్హులు.
- అద్దె ఇంట్లో ఉంటున్న లబ్ధిదారులు కూడా అర్హులే.
- పెళ్లయినా.. ఉమ్మడి కుటుంబంలో జీవిస్తున్నా.. అర్హులైతే.. ఈ పథకానికి ఎంపిక చేస్తారు.
- ఒంటరి , వితంతు మహిళలు కూడా ఈ పథకానికి అర్హులు
- లబ్ధిదారుడు గ్రామం లేదా మున్సిపాలిటీ ప్రాంతానికి చెందిన వారై ఉండాలి.

### లబ్ధిదారుల ఎంపిక విధానం ఇలా..

- అర్హులైన మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారు.
- గ్రామ, వార్డు సభల్లో ఆమోదం పొందిన తర్వాత కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.
- లబ్ధిదారుల జాబితాను ముందుగా గ్రామ సభలో సమర్పించి, పరిశీలించిన తర్వాతే ఖరారు చేస్తారు
- ఆ తర్వాత జిల్లా ఇన్ చార్జి మంత్రిని సంప్రదించి జిల్లా కలెక్టర్ ఇంటిని మంజూరు చేస్తారు.
- జిల్లాల్లో కలెక్టర్, గ్రేటర్ హైదరాబాద్‌లో కమిషనర్ ఎంపిక చేసిన బృందాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతలను పరిశీలిస్తాయి.
- 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టాలి. వంటగది మరియు బాత్రూమ్ విడివిడిగా ఉండాలి. ఇంటిని ఆర్‌సిసి పైకప్పుతో నిర్మించాలి.

### డబ్బులు ఎలా మంజూరు?

- ఈ పథకానికి అర్హులైన వారికి
- దశలవారీగా ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు
- ముందుగా బేస్ మెంట్ స్థాయిలో రూ.లక్ష మంజూరు చేస్తారు.
- ఆ తర్వాత పైకప్పు నిర్మాణ సమయంలో మరో రూ.లక్ష ఇస్తారు.
- పైకప్పు నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు మంజూరు చేస్తారు.
- ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ.5 లక్షలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.



## హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా

లోక్‌సభ ఎన్నికల ముందు హర్యానా రాష్ట్రంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) కూటమి విచ్ఛిన్నమైంది. హర్యానాలో లోక్‌సభ ఎన్నికల సీట్ల పంపకంపై బీజేపీ-జేజేపీ కూటమిలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి మనోహర్ లాల్ ఖట్టర్ మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు సమర్పించారు. మంత్రిమండలి సభ్యులు కూడా తమ రాజీనామాలను సమర్పించారు. తాజా పరిణామంతో బీజేపీ రాష్ట్రంలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 46 సీట్లు అవసరం. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీకి మెజారిటీ తక్కువ రావడంతో బీజేపీ, జేజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. బీజేపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతు ఉంది. జేజేపీకి 10 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. తాజా పరిణామంతో స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో బీజేపీ సొతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ రోజే కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోనున్నట్లు సమాచారం. కాసేపట్లో బీజేపీఎల్పీ సమావేశం నిర్వహించి తదుపరి సీఎం అభ్యర్థిపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సీఎం రేసులో నయబ్‌సైనీ ఉన్నట్లు సమాచారం.

## పెళ్లి ఊరేగింపు పైకి దూసుకెళ్లిన ట్రక్కు.. ఆరుగురు దుర్మరణం




పెళ్లి వేడుక నేపథ్యంలో ఊరేగింపుగా వెళ్తున్న జనాలపైకి ఓ ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని రైజిన్ జిల్లాలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి ఓ పెళ్లి బృందం హోసంగాబాద్ జిల్లా నుంచి రైజిన్ జిల్లాలోని సుల్తాన్‌పూర్ ఏరియాకు చేరుకుంది. దీంతో సుల్తాన్‌పూర్‌లో నూతన వధూవరులతో ఊరేగింపుగా బయల్దేరారు. అదే సమయంలో ఓ ట్రక్కు వేగంగా వచ్చి జనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను సమీప ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం భోపాల్ తరలించాలని అధికారులు ఆదేశించారు. ఈ ప్రమాద ఘటనపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున ప్రకటించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.




## 4 రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

ఖలిస్తానీ ఉగ్రవాదులతో లోకల్ గ్యాంగ్‌స్టర్‌లకు సంబంధాల కేసులో నేషనల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) మంగళవారం విస్తృతంగా సోదాలు జరుపుతోంది. పంజాబ్, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లోని 30 చోట్ల ఎన్ఐఏ పోలీసులు ఏక కాలంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. పంజాబ్‌లోని మోగా జిల్లాలోని బిలాస్‌పూర్ గ్రామంలో, ఫర్దికోట్‌లోని ఓ వ్యాపార వేత్త ఇంట్లోనూ ఎన్ఐఏ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఖలిస్తానీ టెర్రరిస్టులు, లోకల్ మాఫియా మధ్య బలపడుతున్న నెట్‌వర్క్‌లను చేధించేందుకే విస్తృత సోదాలు చేస్తున్నట్లు ఎన్ఐఏ వర్గాల ద్వారా తెలిసింది. సోదాల ద్వారా టెర్రస్టులకు చెందిన నగదు సీజ్ చేయడం, వారి ఆస్తుల డాక్యుమెంట్‌లను స్వాధీనం చేసుకుని వాటిని అటాచ్ చేయడం వీలవుతుందని ఎన్ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## త్రినాధ రావు నక్కిన డైరెక్షన్‌లో సందీప్ కిషన్ నెక్స్ట్ మూవీ!

ఊరు పేరు భైరవకోన బ్లాక్‌బస్టర్ విజయంతో దూసుకుపోతున్న హీరో సందీప్ కిషన్‌కి కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. ఈరోజు తన ల్యాండ్‌మార్క్ 30వ సినిమాని ప్రకటించారు. ధమాకా వంటి భారీ విజయాన్ని అందించిన త్రినాధరావు నక్కిన, తదుపరి సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న SK30 చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఏకే ఎంటర్టైన్మెంట్స్ మరియు హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మించనున్నారు. సామజవరగమన మరియు ఊరు పేరు భైరవకోన వంటి వరుస హిట్‌ల తర్వాత, వారి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్‌లను పూర్తి చేయడానికి ప్రొడక్షన్ హౌస్‌లు ఈ సినిమా కోసం మళ్లీ జతకట్టాయి. త్రినాధ రావు నక్కిన మరియు ప్రసన్న కుమార్ బెజవాడ కాంబినేషన్ విజయవంతమైనది. ఎందుకంటే వారు కలిసి ధమాకాతో సహా అనేక బ్లాక్ బస్టర్‌లను అందించారు. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా వస్తున్న ఈ కొత్త చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే మరియు డైలాగ్‌లను ప్రసన్న కుమార్ అందించారు. రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



## సీఏఏ చట్టం.. తమిళ సర్కారుకు విజయ్ విజ్ఞప్తి

2019లో ఆమోదం పొందిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ) అమలుకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. అయితే, సీఏఏ చట్టంపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై పలువరు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ప్రముఖ హీరో, దళపతి విజయ్ తన పార్టీ 'తమిళగ వెట్రి కగళం' తరుపున స్పందించారు. ఎక్స్.కామ్ పోస్ట్‌లో సీఏఏపై కేంద్రం నిర్ణయం ఆమోద యోగ్యం కాదని ప్రకటన చేశారు. 'దేశంలోని పౌరులందరూ సామాజిక సామరస్యంతో జీవించే వాతావరణంలో భారత పౌరసత్వ సవరణ చట్టం 2019 (CAA) వంటి ఏ చట్టాన్ని అమలు చేయడం ఆమోదయోగ్యం కాదు' అని దళపతి విజయ్ తమిళంలో చేసిన ప్రకటనలో ఉంది. అంతేకాదు తమిళనాడులో ఈ చట్టం అమలుకు నోచుకోకుండా నాయకులు చూసుకోవాలని కోరారు. విజయ్‌తో పాటు, ఇతర ప్రతిపక్ష నాయకులు కూడా పౌరసత్వ (సవరణ) చట్టంపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని విమర్శిస్తున్నారు.




## ఇన్‌శాట్-3డీఎస్ సక్సెస్

ఇస్రో ప్రయోగించిన వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్-3డీఎస్ ప్రయోగం సక్సెస్ అయింది. ఇన్‌శాట్ తాజాగా భూ చిత్రీకరణను ప్రారంభించింది. అందులోని 6-ఛానల్ ఇమేజర్, 19-ఛానల్ సౌండర్ ఒడిసిపట్టిన చిత్రాలను సంస్థ తాజాగా విడుదల చేసింది. 6-ఛానల్ ఇమేజర్. భూ ఉపరితలాన్ని, వాతావరణాన్ని బహుళ తరంగ దైర్ఘ్యాల్లో చిత్రీకరించగలదు. 19-ఛానల్ సౌండర్ సాయంతో భూ వాతావరణం నుంచి వెలువడే రేడియోధార్మికతను పరిశీలించొచ్చు.

## 17 ఏళ్ల బాలికపై ఆరుగురు సామూహిక అత్యాచారం

తమిళనాడులోని తిరుపూర్‌లో వెల్లకోయిల్ సమీపంలో దారుణం జరిగింది. మార్చి 9న వెల్లకోవిల్ ప్రాంతంలో జరుగుతున్న రథోత్సవ కళా ప్రదర్శనకు 17 ఏళ్ల బాలిక వెళ్లింది. ఆ ప్రదర్శన చూస్తున్న బాలికను ఆరుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టి ప్రభాకరన్, మణికందన్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన నలుగురి కోసం గాలింపు చేపట్టారు.



## వందేభారత్ @50.. సికింద్రాబాద్-విశాఖ మార్గంలో పట్టాలెక్కిన మరో రైలు

దక్షిణ మధ్య రైల్వే సారథ్యంలో మరో రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలెక్కాయి. సికింద్రాబాద్-విశాఖ మధ్య ఇప్పటికే ఈ రైలు నడుస్తుండగా.. నేటి నుంచి మరొకటి అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు ద.మ. రైల్వే పరిధిలోని కొన్ని స్టేషన్లను కలుపుతూ కలబురగి-బెంగళూరు మార్గంలో కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం పచ్చజెండా ఊపారు. వీటితో పాటు మొత్తం 10 వందేభారత్‌లను ప్రధాని నేడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం ఈ రైళ్ల సంఖ్య 50 దాటడం విశేషం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.85వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేశారు. వీరిలో కొన్నింటిని జాతికి అంకితం చేశారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 9 పీఎం గతిశక్తి కార్గో టెర్మినళ్లు, 11 గూడ్స్ షెడ్లు, రెండు జన ఔషధి కేంద్రాలు, 3 రైల్వే కోచ్ రెస్టారంట్లను ప్రధాని నేడు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కొల్లం-తిరుపతి మెయిల్ ఎక్స్‌ప్రెస్, పలు మార్గాల్లో రెండో లైను, మూడో లైను, గేజు మార్పిడి, బైపాస్ లైన్లను ప్రారంభించారు.

**51కి చేరిన వందేభారత్‌లు..**

సికింద్రాబాద్-విశాఖ, కలబురగి-బెంగళూరుతో పాటు లఖ్‌నవూ-దేహ్రాదూన్, పట్నా-లఖ్‌నవూ, న్యూ జల్‌పాయ్‌గుడి-పట్నా, పూరి-విశాఖపట్నం, రాంచీ-వారణాసి, ఖజురహో-దిల్లీ, అహ్మదాబాద్-ముంబయి, మైసూరు-చెన్నై మార్గాల్లో మొత్తం 10 రైళ్లను ప్రధాని నేడు ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం వందేభారత్‌ల సంఖ్య 51కి చేరంది. ఇవి 45 మార్గాల్లో పరుగులు తీస్తున్నాయి. అత్యధికంగా దిల్లీ గమ్యస్థానానికి దేశంలోని పలు ప్రాంతాల నుంచి పది వందేభారత్‌లు అందుబాటులో ఉన్నాయి.

# సోషల్ మీడియా ట్రోలింగ్‌కు బలైన యువతి?



ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన యువతి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడింది. ట్రోలింగ్ కారణంగానే యువతి ఆత్మహత్య చేసుకుందని తెలుస్తోంది. ఇటీవల ఇల్లు పట్టా వచ్చిందని, తన ఆనందాన్ని గీతాంజలి మీడియాతో పంచుకుంది. ఈ వీడియో వైరల్ అయ్యింది. ఈ వీడియోలో ఆమె వైసీపీ ప్రభుత్వం అందించిన సాయంపై మాట్లాడింది. దీంతో కొందరు సోషల్ మీడియా ఆమె ట్రోల్ చేశారు. సోషల్ మీడియా వేధింపులు తట్టుకోలేక యువతి గీతాంజలి ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజుల పాటు ఆసుపత్రిలో మరణంతో పోరాడి ఇవాళ చనిపోయింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని #JusticeForGeethanjali #WeStandWithGeethanjali అనే యాష్ ట్యాగ్ లతో ఆమెకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

### గీతాంజలి ఆత్మహత్య

గుంటూరు జిల్లా తెనాలికి గీతాంజలి(28) తన కుటుంబంతో కలిసి నివసిస్తుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం పథకంలో ఆమెకు ఇల్లు వచ్చింది. ఇంటి పట్టాను ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో అందించారు. ఇంటి పట్టా అందుకున్న తర్వాత ఆమె మీడియాతో మాట్లాడింది. వైసీపీ ప్రభుత్వం తన కల నెరవేరిందని, తన పిల్లలకు అమ్మ ఒడి వస్తుందని చెప్పింది. ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆనందంతో చెప్పింది. గీతాంజలి మాట్లాడిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాజకీయ కారణాలతో వైసీపీ శ్రేణులు ఈ వీడియోను తన ఖాతాల్లో పోస్టు చేయగా... ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేశారు. గీతాంజలి ఆత్మహత్యకు ట్రోలింగ్ కారణమని వార్తలు వస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులు ఇంకా స్పందించాల్సి ఉంది.

### అధికార, ప్రతిపక్షాల విమర్శలు

అయితే ఏం జరిగిందో? కానీ ఇంతలో గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడింది. టీడీపీ, జనసేన శ్రేణుల ట్రోలింగ్ కారణంగానే గీతాంజలి బలవన్మరణానికి పాల్పడిందని వైసీపీ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. గీతాంజలి మరణంతో ఆమె పిల్లలు అన్యాయం అయ్యారు. ఆమెకు న్యాయం చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాల్లో #JusticeFor-Geethanjali అని పోస్టులు పెడుతున్నారు. కారణాలు ఏమైనా సరే ట్రోలింగ్ భూతానికి మరో మహిళ బలైపోయింది. సామాన్యుల నుంచి సినీ, రాజకీయ ప్రముఖుల వరకూ ఈ సోషల్ మీడియా రక్కసి చేతిలో నిత్యం వేధింపులకు గురవుతున్నారు. రాజకీయపరమైన అంశాలతో అకౌంట్స్ క్రియేట్ చేసుకుని పార్టీలపై నిత్యం దుమ్మెత్తిపోసుకుంటున్నారు.

### సోషన్ మీడియాపై నిఘా ఏదీ?

అధికారం కోసం ఒకరు, అధికారం నిలుపుకోవడం కోసం మరొకరు చేసిన సామాజిక యుద్ధంలో ఓ అబల బలైపోయింది. కారణాలు ఏమైనా కానీ అంతిమంగా నష్టపోయింది గీతాంజలి, ఆమె కుటుంబం. ట్రోలింగ్ కు అడ్డుకట్టవేయాలని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా? అవి వాస్తవంలో కార్యరూపదాల్చడంలేదు. అధికార పక్షాలే సామాజిక మాధ్యమాల్లో కొన్నిసార్లు పరిధి దాటి ప్రవర్తిస్తున్నాయి. అలాంటప్పుడు బాధ్యులపై ఎలా చర్యలు తీసుకుంటాయని ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పటికైనా సోషల్ మీడియా ట్రోలింగ్ పై నిఘా ఉండాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# బైజూస్ ఆఫీసులు మూసివేత..

## వర్క్‌ఫ్రం హోం చేయండంటూ ఉద్యోగులను కోరిన సంస్థ..!




ఒకప్పుడు ప్రపంచంలోనే మోస్ట్ వాల్యూడ్ ఎడ్‌టెక్ కంపెనీగా ఉన్న బైజూస్ ఇప్పుడు పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. తీవ్ర ద్రవ్య కొరతను ఎదుర్కొంటోంది. సంస్థలోని ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా బెంగళూరులోని ప్రధాన కార్యాలయం తప్ప దేశవ్యాప్తంగా ఉన్న ఆఫీసులన్నింటినీ మూసివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లుగా జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. బెంగళూరు నాలెడ్జ్ పార్కులోని ఐబీసీ వద్ద ఉన్న ప్రధాన కార్యాలయం ఒకటి మాత్రమే కొనసాగుతుందని స్పష్టం చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఆఫీసుల మూసివేత ప్రక్రియ గత కొన్ని నెలలుగా కొనసాగుతోందని తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో బైజూస్ ఆఫీసుల లీజు గడువులు ముగిసిన వెంటనే ఎక్కడికక్కడ ఆఫీసులు మూసివేస్తున్నట్లు తెలిపాయి. దేశవ్యాప్తంగా బైజూస్ సంస్థలో సుమారు 14,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారందరినీ ఇంటి నుంచే పనిచేయాల్సిందిగా సంస్థ కోరినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న 1000 మంది సిబ్బంది సహా దేశవ్యాప్తంగా ఉన్న 300 ట్యూషన్ కేంద్రాల సిబ్బందికి మాత్రం వర్క్ ఫ్రం హోమ్ వర్తించదు. ట్యూషన్ కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని సంబంధిత వర్గాలు చెప్పినట్లుగా సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ కేంద్రాలకు వచ్చి విద్యను అభ్యసిస్తూ ఉండటంతో వాటిని యథాతథంగా కొనసాగించాలని కంపెనీ నిర్ణయించినట్లు నివేదికలు వెల్లడించాయి.

# ఆర్సీబీకి శుభవార్త




మహిళల ఐపీఎల్ 2024 ఎడిషన్ చివరి దశకు చేరింది. గ్రూప్ దశలో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇదివరకే రెండు ప్లేఆఫ్స్ బెర్త్‌లు ఖరారై పోయాయి. ఇక మిగిలింది ఓ బెర్త్. ఈ బెర్త్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దాదాపుగా ఖరారు చేసుకుంది. ఏదో మహాద్భుతం జరిగితే తప్ప ఆర్సీబీ ప్లేఆఫ్స్‌కు చేరదు. ఇవాళ (మార్చి 12) ముంబై ఇండయన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆర్సీబీ ఓడినా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అయితే భారీ తేడాతో ఓడితే మాత్రం సమీకరణలు మారిపోతాయి. ఇవాల్టి మ్యాచ్‌లో ఆర్సీబీ ముంబై చేతిలో 60 కంటే ఎక్కువ పరుగుల తేడాతో ఓడితే యూపీ వారియర్జ్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఆర్సీబీ తర్వాత యూపీ వారియర్జ్‌కు మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరుకునే ఛాన్స్ ఉందని అనుకోవడానికి వీల్లేదు. గుజరాత్ జెయింట్స్ తమ చివరాఖరి గ్రూప్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను కనీసం 57 పరుగుల తేడాతో ఓడిస్తే ఈ జట్టు కూడా ప్లేఆఫ్స్ బరిలో ఉంటుంది.

ఏ జట్టు అవకాశాలు ఎలా ఉన్నాయంటే..

ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అయ్యే మూడో జట్టు మార్చి 15న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న జట్టుతో తలపడుతుంది. తదుపరి జరుగబోయే రెండు గ్రూప్ మ్యాచ్‌ల ఆధారంగా పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాలు నిర్ధారించబడతాయి. ప్రస్తుతానికి రన్‌రేట్ ఆధారంగా ఢిల్లీ టాప్‌లో ఉంది. పాయింట్లు సమానంగా ఉన్నా ముంబై ఇండియన్స్ రెండో స్థానంలో నిలిచింది. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచే జట్టుతో మార్చి 17న జరిగే అంతిమ సమరంలో అమీతుమీ తేల్చుకోనుంది.

## ప్రొఫెసర్ సాయిబాబాకు సుప్రీంకోర్టులో ఊరట



ఇటీవల జైలు నుంచి విడుదలైన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మావోయిస్టులతో సంబంధాలున్న కేసులో అతన్ని నిర్దోషిగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బాంబే హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను భారత అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది.

## బంపర్ ఆఫర్ కొట్టేసిన మృణాల్

'సీతారామం' చిత్రంతో అందరి చూపును తనవైపు తిప్పుకున్నారు బాలీవుడ్ నటి 'మృణాల్ ఠాకూర్'. అప్పటివరకు పలు సీరియల్స్, సినిమాలు చేసినా రాని క్రేజ్.. సీతారామంతో ఓవర్ నైట్ స్టార్ అయ్యారు. తెలుగులో 'హాయ్ నాన్న'సినిమాలో నటించి.. మరో భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్ ఇండస్ట్రీలోనూ అమ్మడు బిజీ అయిపాయారు. మృణాల్ స్టార్ హీరోల సరసన నటిస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ చేతిలో 4-5 సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న మృణాల్ ఠాకూర్‌ను మరో బంపర్ ఆఫర్ వరించిందని ఫిల్మ్‌నగర్ టాక్. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు జోడీగా మృణాళ్ నటించనుందట. ప్రభాస్ హీరోగా, సీతారామం దర్శకుడు హను రాఘవపూడి కాంబోలో ఓ పీరియాడికల్ డ్రామా తెరకెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్‌ను ఎంపిక చేశారని సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతోంది.

